సాక్షి జగిత్యాల

శనివారం । 25 । నవంబర్ । 2023



నేత్రపర్వంగా గంగాహారతి

ధర్మపురి: ధర్మపురి గోదావరినది వద్ద నిర్వహిస్తున్న గంగాహారతి శుక్రవారం 11వ రోజుకు చేరింది. ప్రత్యేక పూజలు చేసి నదిలో దీపాలు వదిలారు.



రైతుల తిప్పలు..

ప్రభుత్వం ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. కేంద్రాల్లో ధాన్యం సంరక్షణకు కనీస వసతులు కరువయ్యాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం 26.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రాబోయే ఐదు రోజుల్లో జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధనస్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 25 నుంచి 29 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 31–32 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 18–20 డిగ్రీల సెల్సియస్‌గా, గాలిలో తేమ ఉదయం 62–85 శాతం, మధ్యాహ్నం 51–64 శాతం మధ్య ఉండే అవకాశం ఉందని వివరించారు. ఆగ్నేయ దిశ నుంచి గాలులు గంటకు సగటున 6–8 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. వర్షసూచన ఉన్నందున రైతులు కోసిన పంటను టార్పాలిన్లు కప్పి భద్రపర్చుకోవాలని, మార్కెట్‌కు తరలించడం వాయిదా వేసుకోవాలని సూచించారు.

రేపు జగిత్యాలకు సీఎం కేసీఆర్



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ వసంత తదితరులు

జగిత్యాల: సీఎం కేసీఆర్ ఈనెల 26న జగిత్యాలకు రానున్న నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్సీ రమణ ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని గీతా విద్యాలయం సమీపంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన వెంట జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, ప్యాక్స్ చైర్మన్లు సందీప్‌రావు, మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు బాల ముకుందం, నక్క రవీందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసీఫ్ ఉన్నారు.

నేడు జిల్లాకు ఎమ్మెల్సీ కవిత రాక



జగిత్యాల: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. కోరుట్ల నియోజకవర్గంలో ప్రచారంలో పాల్గొంటారు. ఉదయం 10.30 గంటలకు నందిచౌరస్తా, 11.30 గంటలకు గోరెమియా హోటల్ సమీపంలో, 12.30 గంటలకు కల్లూరు రోడ్‌లోని మణికంఠ స్టేడియం, 1.30 గంటలకు పీఎం ఇందిరారోడ్ చౌరస్తాలో జరిగే సభల్లో పాల్గొననున్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



బసవ రాజేంద్రతో సీనియర్ సిటిజన్స్

జగిత్యాల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఎన్నికల పరిశీలకులు బసవ రాజేంద్ర అన్నారు. శుక్రవారం ఎస్సారెస్పీ గెస్ట్‌హౌస్‌లో బసవ రాజేంద్రను సీనియర్ సిటిజన్ నాయకులు కలిశారు. దివ్యాంగులకు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక క్యూలైన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతంకన్నా ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు ఎన్నికల కమిషన్ కల్పించిన హోం ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. పోలింగ్ రోజున సైతం వృద్ధులు, దివ్యాంగులు నేరుగా ఓటింగ్ సౌకర్యం పొందవచ్చని పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, లైజన్ అధికారి వకీల్, విశ్వనాథం, యాకూబ్, అశోక్‌రావు పాల్గొన్నారు.

దూలూర్‌లో ఒకరికి డెంగీ



గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం దూలూర్ గ్రామంలో ఒకరికి డెంగీ పాజిటివ్ వచ్చిందని వైద్యాధికారులు శుక్రవారం పేర్కొన్నారు. గ్రామంలోని పలు వాడల్లో ప్రజలు జ్వరంతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో ఒకరికి తీవ్ర జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ పరీక్షలు చేయగా డెంగీ పాజిటివ్‌గా గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు ఆకుల శ్రీనివాస్, ఎండీ సమియొద్దీన్ గ్రామంలోని పలు వాడల్లో పర్యటించారు. దోమల నివారణ మందు స్ప్రే చేయించాలని స్థానిక అధికారులకు సూచించారు. డ్రైనేజీల్లో చెత్త లేకుండా చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట వైద్యాధికారి రచన, సీహెచ్‌వో వెంకన్న, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఆలోచించి ఓటెయ్యండి



గోదావరిఖనిలో జరిగిన ప్రజాఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

- ఉద్యమకారుడు కోరుకంటి చందర్‌ను గెలిపించండి
- రామగుండాన్ని పారిశ్రామిక వాడగా మారుస్తాం
- గోదావరిఖని ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన కె.చందర్

సాక్షి, పెద్దపల్లి: 'ఎన్నికలు వచ్చాయంటే ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయాలి. తెలంగాణ ప్రజల హక్కుల కోసం పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్. ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థుల వెనుక ఉన్న పార్టీలను చూడాలి. వాటి నడవడిక, దృక్పథం ఏంటో తెలుసుకోవాలి. కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం గెలవమంటే ఎట్లా?' అని సీఎం కేసీఆర్ అన్నారు. శుక్రవారం రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలోని గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ సింగరేణి స్టేడియంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. సింగరేణి తెలంగాణ కొంగుబంగారమని, అటువంటి సింగరేణిని ముంచింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. వారసత్వ ఉద్యోగాలు ఊడగొట్టింది, 49శాతం వాటా కేంద్రప్రభుత్వానికి అప్పజెప్పింది కాంగ్రెస్ పార్టీయే అనే విషయాన్ని కార్మికులు గుర్తుంచుకోవాలని సూచించారు. కోరుకంటి చందర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని, ఆయన తెలంగాణ ఉద్యమకారుడని అన్నారు. ఉద్యమ కాలంలో 74రోజులపాటు జైల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఆయన కూడా సింగరేణి కార్మికుడి కుమారుడేనని, సింగరేణి గురించి బాగా అవగాహన ఉందని చెప్పారు. ఇక్కడ బొగ్గు, నీళ్ల తదితర వనరులు ఉన్నాయయని, రవాణా వసతి ఉందని, రైలు మార్గం ఉందని, అయినా, పరిశ్రమలు లేవని చందర్ చెప్పారని సీఎం అన్నారు. సమైక్య రాష్ట్రంలో రామగుండం నిర్లక్ష్యానికి గురైందని, మనం ఇప్పుడు కుదుటపడ్డామని తెలిపారు. ఈ ప్రాంతానికి రావాల్సిన పరిశ్రమల గురించి ఆలోచించి తీసుకువస్తానని మాట ఇచ్చారు. పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేసుకుందామని కేసీఆర్ తెలిపారు.

ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్

'తెలంగాణను ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్. గోదావరి ఒరుసుకుంటూ పారే మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో మంచినీళ్ల గోస, కరెంటు గోస, చేనేత కార్మికుల చనిపోవుడు, రైతులు ఆత్మహత్యలు చేసుకునుడు, కరెంట్ ఇస్తే తెల్లందాక ఇంత, పొద్దందాకా ఇంత, ఆడ పాములు కరిచి చనిపోవుడు.. ఇలా విపరీతమైన బాధలు పడ్డాం' అని సీఎం అన్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు ఉండేవని, వాటిని ఊడగొట్టింది కాంగ్రెస్సే కదా? అని ప్రశ్నించారు. గవర్నమెంట్ కాంగ్రెస్సేనని, ఒప్పందాలపై సంతకాలు పెట్టి ఉన్న హక్కులను పోగొట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించుకున్నామని అన్నారు. అంతేకాకుండా 15వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుకున్నామని చెప్పారు. కాంగ్రెస్‌వాళ్లు ఉన్నప్పుడు ఇవ్వలేదని, తాము ఇస్తుంటే ఓరుస్త లేరని విమర్శించారు.

అలరించిన ఆటాపాటా

సింగరేణి స్టేడియంలో నిర్వహించిన సభకు భారీగా జనం తరలిరాగా, ఏపూరి సోమన్న తన ఆటాపాటలతో జనాలను ఉర్రూతలూగించారు. 'గుర్తు గుర్తుంచుకో రామక్క' ఆలపించిన సమయంలో స్టేడియంలో గులాబీ శ్రేణులు సైతం పాదం కలిసి నృత్యాలు చేశారు. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో గులాబీ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అయితే, 'గోదావరిఖని కదా.. జరగట్లనే ఉంటుంది' అని సీఎం కేసీఆర్ పేర్కొంటూ సభికులను మరింత ఉత్సాహపరిచారు.

గోదావరి నదిపై కేబుల్ బ్రిడ్జి నిర్మించాలి : కోరుకంటి

గోదావరి నదిపై కేబుల్ బ్రిడ్జి నిర్మించి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి. అలాగే అన్ని వనరులు కలిగి ఉన్న రామగుండం నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొచ్చి, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి. కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యాక రామగుండం వచ్చి సమస్యలపై సమీక్షించి పరిష్కారించాలని కోరుతున్నా.

రెచ్చగొట్టే మాటలతో ప్రజలను ఆగం చేయొద్దు

- కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్



చౌలమద్దిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్

కోరుట్ల: ప్రశాంతంగా ఉన్న కోరుట్ల నియోజకవర్గాన్ని ప్రత్యర్థి పార్టీలు రెచ్చగొట్టే మాటలతో ఆగం చేయ్యద్దని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో మాట్లాడారు. తండ్రిలాంటి కేసీఆర్ చస్తే రూ.10 లక్షలు బీమా ఇస్తానని, తన తండ్రి విద్యాసాగర్‌రావును ఖతం చేస్తానని ఎంపీ అరవింద్ అనడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. అరవింద్ తండ్రి డి.శ్రీనివాస్‌కు తాను వైద్యం అందించానని గుర్తు చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3 గంటలు విద్యుత్ అందిస్తే 10 హెచ్‌పీ మోటార్లతో పంటలు పండుతాయని పేర్కొంటున్నాడని, కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి 5 గంటలే కరెంటు ఇస్తుందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ రెండురోజుల క్రితం రాష్ట్రానికి వచ్చి వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టకపోవడం వల్లే ఎఫ్‌ఆర్‌బీఎం నిధులు విడుదల చేయలేదని స్వయంగా ఒప్పుకున్నారని దీంతో రాష్ట్రానికి రావాలసిన రూ.25 వేల కోట్ల కేంద్ర నిధులు రాలేవన్నారు. 15 ఏళ్లలో తనతండ్రి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరుట్లను ఎంతో అభివృద్ధి చేశారని తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుపుతానన్నారు. అనంతరం పట్టణంలోని మసీదుల వద్ద సంజయ్ ప్రచారం నిర్వహించారు. అలాగే పట్టణంలోని 5వ వార్డుకు చెందిన 20 మంది నాయకులు వివిధ పార్టీలనుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు.

సంజయ్ సతీమణి ప్రచారం

కోరుట్లరూరల్/మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్: కోరుట్ల రూరల్ మండలంలోని సంగెం గ్రామంలో సంజయ్ సతీమణి దీప్తి, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరారు. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి, కోజన్‌కొత్తూర్ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం మసీదుల వద్ద ప్రచారం నిర్వహించారు. అలాగే కల్వకుంట్ల సంజయ్ మెట్‌పల్లి మండలం చౌలమద్ది గ్రామంలో ప్రచారం నిర్వహించారు.


బీఆర్‌ఎస్‌నే గెలిపించాలి

మల్లాపూర్/ఇబ్రహీంపట్నం: ప్రజా సంక్షేమ కోసం మళ్లీ బీఆర్‌ఎస్‌నే గెలిపించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు బదినపెల్లి ప్రేమ్ అన్నారు. మల్లా పూర్‌లో సంజయ్‌కి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో మాల సంఘ సభ్యులు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

నారీ.. ప్రాధాన్యమేది?

ఓట్లున్నా.. సీట్లు లేవు

- ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు
- పురుష ఓటర్లు 14,40,023
- మహిళా ఓటర్లు 14,96,622
- బీఆర్‌ఎస్ నుంచి 0, బీజేపీ నుంచి 04, కాంగ్రెస్ నుంచి 0, బీఎస్పీ నుంచి 01
- మహిళలను విస్మరించిన ప్రధాన రాజకీయ పార్టీలు
- అతివకు అసెంబ్లీకి దక్కని ప్రాధాన్యం



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఆకాశంలో సగం.. అవనిలో సగం.. అని మహిళల గురించి చెప్పే మాటలు బాగానే ఉన్నా.. ఆచరణలోకి వచ్చే సరికి ఎవరూ పాటించడం లేదు. రాజకీయాల్లోకి రావాలన్న ఆసక్తి ఉన్నా.. అవకాశాలు లేక మహిళలు అట్టడుగునే ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో చూసుకుంటే.. మొత్తం ఓటర్లలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఆ మేరకు రాజకీయంగా మాత్రం వారికి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వలేదు. శాసనకర్తలు మహిళలు ఉంటే ఆ వర్గానికి మరింత న్యాయం జరుగుతుందనేది అందరూ ఏకీభవించాల్సిన వాస్తవం. మహిళలు అంతరిక్షంలో అడుగుపెడుతున్న ప్రస్తుత ఆధునిక యుగంలో రాజకీయాల్లో మాత్రం వారికి అంతగా ప్రాధాన్యం లభించడం లేదనే చెప్పవచ్చు. ఇందుకు ప్రస్తుత శాసనసభ ఎన్నికలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ప్రధానపార్టీల నుంచి 36 మంది బరిలో నిలిస్తే అందులో మహిళలు కేవలం ఐదుగురు మాత్రమే ఉండడం ఆయా పార్టీల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇందులో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నుంచి మహిళలకు అసలే ప్రాధాన్యం దక్కకపోగా, బీజేపీ నుంచి రామగుండం, సిరిసిల్ల, చొప్పదండి, జగిత్యాల సీట్లు అతివలకు కేటాయించారు. పెద్దపల్లి నుంచి బీఎస్పీ మహిళను బరిలో నిలపింది. బీజేపీ నాలుగు స్థానాలు కేటాయించి అగ్రస్థానంలో నిలిచింది. మహిళలు సైతం స్వతంత్రంగానైనా బరిలో నిలిచే సాహసం చేయకపోవడం సమాజంలో మహిళలంటే వివక్ష దూరం కాలేదన్న వాదనకు తెరలేపుతోంది.

అన్ని జిల్లాల్లో ఎక్కువే..

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములు మహిళలే శాసించనున్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. రాజకీయ పార్టీలు మహిళల జనాభా, ఓటర్లకు అనుగుణంగా రాజకీయ అవకాశాలు కల్పించడం లేదన్న అసంతృప్తి ఉంది. 50 శాతం రిజర్వేషన్ల పుణ్యమాని స్థానిక సంస్థల్లో సగానికిపైగా ప్రజాప్రతినిధులు మహిళలకు అవకాశం దక్కుతోంది. కానీ.. అసెంబ్లీకి వచ్చే సరికి మాత్రం మహిళలకు ప్రాధాన్యం దక్కడం లేదు. రాజకీయ పార్టీలు.. వారికి పోటీ చేసేందుకు ఇస్తున్న సీట్లు, అందులో వారు గెలిచే స్థానాలు.. పురుషులతో పోల్చితే చాలా తక్కువగా ఉంటున్నాయనే విమర్శ ఉంది.

దేశంలో ఇలా..

1998–2023 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 21,161 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నిక కాగా.. వారిలో మహిళల సంఖ్య 1,584 మాత్రమే. ఏపీ, తెలంగాణ సహా దేశంలో 19 రాష్ట్రాల్లో మహిళా శాసనసభ్యులు 10 శాతానికి మించి లేరు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 1,821 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. అందులో బరిలో నిలిచిన మహిళల సంఖ్య 140 మాత్రమే. కానీ.. అందులో గెలిచిన మహిళల సంఖ్య కేవలం ఆరుమాత్రమే.

రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో...

2018 ఎన్నికల్లో తెలంగాణలో ఖానాపూర్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి అజ్మీరా రేఖానాయక్, మెదక్ నుంచి పద్మాదేవేందర్ రెడ్డి, మహేశ్వరం నుంచి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి, ఆలేరు నుంచి గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, ములుగు నుంచి సీతక్క, ఇల్లందు నుంచి బానోతు హరిప్రియ ఎన్నికయ్యారు. ఈ లెక్కన 119 నియోజకవర్గాల్లో ఎన్నికైన మహిళా శాసన సభ్యుల సంఖ్య కేవలం ఐదు శాతం మాత్రమే.

33 శాతం రిజర్వేషన్ అమలైతే..

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్లో బిల్లు ఆమోదం పొందింది. అది చట్టంగా మార్చితే మహిళలకు ఆ మేరకు సీట్లు కేటాయించడం తప్పనిసరి. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2027 తర్వాతే ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకు వస్తామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. చట్టం అమల్లోకి వస్తే 12 నియోజకవర్గాలకు గాను ప్రతీ పార్టీ సుమారు నాలుగేసి స్థానాలు విధిగా కేటాయించాల్సి ఉంటుంది.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

- జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



జగిత్యాలలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల అభివృద్ధిని చూడండి, మరోసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 23,24,39,40,46,1,2వ వార్డుల్లో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులవి ఓట్ల రాజకీయాలే తప్ప వారు చేసిందేమీ లేదన్నారు. అలాగే నియోజకవర్గస్థాయి విశ్వకర్మల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు గట్టు సతీశ్, వెంకటరమణ, టీవీ సత్యం పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా సీఎం కేసీఆర్

అన్నివర్గాలకు అండగా సీఎం కేసీఆర్ ఉన్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మసీదుల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ మైనార్టీల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని, మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

సంక్షేమ పథకాలు చూసి..

జగిత్యాలరూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు చూసే ప్రజలు బీఆర్‌ఎస్‌కు చేరువవుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొరండ్లకు చెందిన 20 మంది , సంగంపల్లికి చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు మల్లేశం, 25 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే సంజయ్‌కుమార్‌కు పొరండ్లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు దుంపల కరుణాకర్‌రెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

నిరుపేదలకు అండగా ఉంటా

రాయికల్(జగిత్యాల): నిరుపేదలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం సింగరావుపేట, అల్లీపూర్, కుర్మపల్లి, కిష్టంపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అయోధ్య గ్రామానికి చెందిన 20 మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మాయమాటలు నమ్మి ప్రజలెవరూ మోసపోవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, ఎంపీటీసీ మోర విజయ లక్ష్మీ, సర్పంచులు రాంచందర్‌రావు, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

జగిత్యాల రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. శుక్రవారం రాత్రి జగిత్యాల అర్బన్ మండలం దరూర్‌లో ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికి ఆదర్శంగా నిలిపారన్నారు. జెడ్పీటీసీ మహేశ్, నాయకులు పాల్గొన్నారు.



అల్లీపూర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సమస్యాత్మక కేంద్రాల తనిఖీ



మేడిపల్లి(వేములవాడ): మేడిపల్లి, భీమారం మండలాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి తనిఖీ చేశారు. స్థానికులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ వెంట కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, మేడిపల్లి ఎస్సై శ్యాంరాజ్ ఉన్నారు.

నిబంధనల మేరకు హోం ఓటింగ్



హోం ఓటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ యాస్మిన్ బాషా



హైదరపల్లిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

జగిత్యాల: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు హోం ఓటింగ్ నిర్వహించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో హోం ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో 12డీ ఫాంల ద్వారా 1,141 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, శుక్ర, శనివారాల్లో అర్హులు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటింగ్ సరళిని పరిశీలించి పలు సూచనలు చేశారు.

తొలిరోజు 975 మంది ఓటింగ్

80 ఏళ్లకు మించిన వయోవృద్ధులు, 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగుల కోసం ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. దీంతో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో 1,247 మంది ఉండగా తొలిరోజు శుక్రవారం 975 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. మొత్తం 70 బృందాలు నియోజకవర్గాల్లో తిరుగుతూ ఓట్లను స్వీకరించాయి.

ఇంటి వద్దే ఓటేసిన వృద్ధులు

జగిత్యాలరూరల్: 80 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఎన్నికల కమిషన్ ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శుక్రవారం ఎన్నికల అధికారులు జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల, హన్మాజీపేట, కన్నాపూర్, హైదర్‌పల్లి గ్రామాల్లో ఇంటి వద్దకు వెళ్లి వృద్ధులకు ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పించారు. హైదర్‌పల్లికి చెందిన 92 ఏళ్ల వృద్ధుడు ఆకుల గంగారాం, 90 ఏళ్ల వృద్ధురాలు లైశెట్టి లచ్చవ్వ తమ ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కల్యాణ వైభోగమే..





కోరుట్ల: మండలంలోని వెంకటాపూర్ శివారులో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీఅలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి కల్యాణం, అన్నదాతగా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు వ్యవహరించారు. ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌కు సీనియర్ సిటిజన్స్ అభినందనలు



అభినందనలు తెలుపుతున్న సీనియర్ సిటిజన్స్

జగిత్యాల: వయోవృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ సౌకర్యం కల్పించినందుకు సీనియర్ సిటిజన్స్ శుక్రవారం కలెక్టర్ యాస్మిన్‌బాషాకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హోం ఓటింగ్ కాకుండా సీనియర్ సిటిజన్స్ నేరుగా వెళ్లి ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులకు సూచిస్తామన్నారు. పోలింగ్ రోజు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ హరి అశోక్ కుమార్, విశ్వనాథం, యాకూబ్, అశోక్‌రావు, యూసూఫ్, ప్రకాశ్‌రావు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు

వేములవాడ: భార్య కాపురానికి రాకపోవడానికి కారకుడనే అనుమానంతో ఇంటికెళ్లి అతని భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన నేరంలో నిందితుడు సింగిరెడ్డి వెంకటేశ్‌కు మూడు నెలల జైలు శిక్ష లేదా రూ.వేయి జరిమానా విధిస్తూ వేములవాడ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సట్టు రవీందర్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు. బోయినపల్లి మండలం నీలోజిపల్లికి చెందిన కొంకటి లచ్చిరెడ్డి బంధువుల అమ్మాయితో అదే గ్రామానికి చెందిన సింగిరెడ్డి వెంకటేశ్‌తో వివాహమైంది. వెంకటేశ్ తరచూ తన భార్యతో గొడవ పడగా ఆమె అతన్ని వదిలి తల్లి గారింటికెళ్లింది. తన భార్య కాపురానికి రాకపోవడానికి కారణం లచ్చిరెడ్డి అని వెంకటేశ్ కక్ష పెంచుకున్నాడు. 2022, జనవరి 14న గొడ్డలి పట్టుకొని లచ్చిరెడ్డిపై దాడి చేసేందుకు అతని ఇంటికెళ్లాడు. ఆ సమయంలో లచ్చిరెడ్డి ఇంట్లో లేకపోవడంతో అతని భార్య యాదమ్మపై దాడికి ప్రయత్నించగా ఆమె తప్పించుకుంది. ఈ సంఘటనపై యాదమ్మ ఫిర్యాదుతో బోయినపల్లి పోలీసులు వెంకటేశ్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ బన్సీలాల్ దర్యాప్తు చేపట్టారు. సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్ కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి వెంకటేశ్‌కు మూడు నెలల జైలు శిక్ష లేదా జరిమానా విధించారు.

ప్లాట్‌ఫామ్‌పైకి దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు



గోదావరిఖనిటౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ బస్సు అదుపుతప్పి ప్లాట్‌ఫామ్‌పైకి దూసుకొచ్చింది. ఆ సమయంలో అక్కడ ప్రయాణికులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భూపాల్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుంచి భూపాల్‌పల్లికి వెళ్తూ శుక్రవారం ఉదయం 9 గంటలకు గోదావరిఖని బస్టాండ్‌కు చేరుకుంది. ప్రయాణికులను దించేందుకు డ్రైవర్ జి.నాగరాజు ప్లాట్‌ఫామ్ నంబరు 14 పై బస్సు తీసుకొచ్చాడు. ఆ క్రమంలో బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో బస్సు ఒక్కసారిగా ప్లాట్‌ఫామ్‌పైకి దూసుకొచ్చింది. బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు వెంటనే అప్రమత్తమై ఒక్కసారిగా వెనక్కి పరుగులు తీశారు. బస్సు బెడ్‌ను ఢీకొని ఆగిపోయింది. దీంతో ప్రమాదం తప్పినట్లయ్యింది. ఆ సమయంలో బస్సులో 47మంది ప్రయాణికులు ఉన్నారు. కొందరికి స్వల్ప గాయలయ్యాయి. అనంతరం బస్సులోని ప్రయాణికులను దింపి మరొక బస్సులో గమ్యస్థానాలకు పంపించివేశారు.

ధాన్యం కుప్పలు.. రైతుల తిప్పలు

- టార్పాలిన్లు ఇంటి నుంచి తెచ్చుకోవాల్సిందే..
- ఒక్కో టార్పాలిన్ కిరాయి రోజుకు రూ.30



అన్నదాతల ఆందోళన



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

జగిత్యాలరూరల్: సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లి గ్రామంలో శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. తేమ శాతం వచ్చినా కొనుగోలు చేయకపోవడంతో పాటు, తూకం వేసిన ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం చేస్తుండటంతో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసింది. వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

రాయికల్‌లో తడిసిన ధాన్యం

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణంలో శుక్రవారం ఉదయం కురిసిన వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసింది. అసలే కొనుగోళ్ల ప్రారంభం కాక రైతులు ఇబ్బందులు పడుతుంటే ఒక్కసారిగా కురిసిన వర్షంతో ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

స్వల్పంగా కురిసిన వర్షం

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్, బీర్పూర్ మండలాల్లో శుక్రవారం స్వల్పంగా వర్షం కురిసింది. వేకువజామున కొంత ఎక్కువగా, మధ్యాహ్నం స్వల్పంగా వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొంతమేర తడిసింది. ధాన్యం రాశులపై రైతులు టార్పాలిన్లు కప్పారు.

జగిత్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. కేంద్రాల్లో ధాన్యం సంరక్షణకు కనీస వసతులు లేవు. వర్షం వస్తే ధాన్యంపై కప్పేందుకు రైతులే టార్పాలిన్ కవర్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వాతావరణం మబ్బులతో ఉండి వర్షం కురిసే అవకాశం ఉండటంతో రైతులు కవర్ల కోసం పరుగులు తీస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇంటి నుంచి లేదా అద్దెకు..

జిల్లావ్యాప్తంగా 400 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో సగం ఐకేపీ మహిళలు నిర్వహిస్తుండగా, మరో సగం సింగిల్ విండోలు నిర్వహిస్తున్నాయి. అసలే కేంద్రాలకు సరైన స్థలం లేదంటే ఉన్న స్థలాల్లో రైతులు ధాన్యం పోసేందుకు నిర్వాహకులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో రైతులే ఇంటి నుంచి చీరలతో పాటు రసాయన ఎరువుల బస్తాల సంచులతో కుట్టించిన పరదాలు, కవర్లు తెచ్చుకుని వాటిలో ధాన్యం పోస్తున్నారు. ఇంట్లో కవర్లు లేనివారు అద్దెకు తీసుకవస్తున్నారు. ఒక్కో కవర్‌కు రోజుకు రూ.30 చెల్లిస్తున్నారు. ధాన్యం కుప్ప పోసేందుకు ఒకట్రెండు కవర్లు ఉంటే సరిపోయేవి. కానీ ధాన్యాన్ని ఆరబెట్టేందుకు నాలుగైదు కవర్లు అవసరమవుతున్నాయి. అలాగే రోజుల తరబడి ధాన్యం తూకం వేయకపోవడంతో కవర్లకే ఒక్కో రైతు కనీసం రూ.2–3 వేలు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే అదనుగా రోడ్డుకు సమీపంలో ఉన్న కేంద్రాల్లో కొందరు దొంగలు ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లను రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ధాన్యం తూకం వేసిన తర్వాత సంచులపై కేంద్రం నిర్వాహకులు కవర్లు కప్పడం లేదు. దానికి సైతం రైతులనే బాధ్యులను చేయడంతో లారీల్లోకి సంచులు ఎక్కించేవరకు ధాన్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

క్వింటాల్‌కు రూ.32 కమీషన్

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లుకు అప్పగించినందుకు ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.32 కమీషన్‌ను సివిల్ సప్లై సంస్థ కొనుగోలు ఏజెన్సీలకు ఇస్తుంది. అయినా నిర్వాహకులు ఇటు రైతులకు అటు ధాన్యం సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదు. గతంలో చాలా కేంద్రాల్లో వర్షం పడి ధాన్యం కొట్టుకుపోయింది. తాజాగా జిల్లాలోని పలు గ్రామాల్లో శుక్రవారం వర్షం కురవడంతో కవర్లు కొంత మేర ధాన్యం నానింది. అయితే పెద్దగా కురవకపోవడంతో రైతులకు ఇబ్బంది కలగలేదు.

టార్పాలిన్లు ఇవ్వాలి



కొనుగోలు కేంద్రానికి తీసుకవచ్చిన ధాన్యం వర్షానికి తడిసి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి సీజన్‌లో టార్పాలిన్ కవర్లను ఇస్తామని చెపుతున్నా ఎక్కడ ఆచరణలో కనబడటం లేదు. నిర్వాహకులే టార్పాలిన్లు ఇవ్వాలి.

– కరుణాకర్, ధర్మపురి

పదివేల వరకు సప్లై చేశాం



జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు ఇప్పటికే 10 వేల వరకు టార్పాలిన్లు సరఫరా చేశాం. అవసరమైన చోటుకు మరిన్ని సప్లై చేస్తాం. అయితే కొనుగోళ్లు పూర్తయిన తర్వాత కేంద్రాల నుంచి తిరిగి టార్పాలిన్లు సరిగ్గా ఇవ్వడం లేదు.

– ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొని రెంటం లింగన్న (65) అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన రెంటం లింగన్న తన మనువడి కేశఖండన కోసం శుక్రవారం ఉదయం ధర్మపురి గోదావరికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నాడు. అనంతరం కల్లెడ గ్రామంలోని కల్లు మండువా వద్ద బంధువులకు విందు ఏర్పాటు చేశారు. విందు జరుగుతున్న సమయంలో లింగన్న మూత్ర విసర్జనకు వెళ్లగా ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొనడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

పొలాసలో విషాదం

పొలాసకు చెందిన రెంటం లింగన్న మనువడి కేశఖండన కార్యక్రమానికి వెళ్లి బంధువులందరికీ విందు ఇస్తున్న తరుణంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. బంధువులతో పాటు, గ్రామస్తులు సంఘటన స్థలంలో తీవ్రంగా రోదించారు.

శాస్త్రుర్లపల్లిలో విద్యుదాఘాతం

- రూ. 5లక్షల మేర ఆస్తినష్టం

మంథని: ఎక్లాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శాస్త్రుర్లపల్లి గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతం జరిగింది. గ్రామానికి చెందిన బండారు లక్ష్మయ్య ఇల్లు మంటల్లో కాలిపోయింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. లక్ష్మయ్యన తన భార్య నివాసం ఉండే ఇంటివెనుకాల గదిలో విద్యుత్ మీటర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంటి ఎదుట ఉన్న గదిలో ఉన్న లక్ష్మయ్య దంపతులు ఉంటున్నారు. వీరు వృద్ధులు కావడంతో మంటల్ని సకాలంలో గుర్తించలేకపోయారు. ఇంట్లో నుంచి వస్తున్న పొగ చూసిన స్థానికులు ఆ దంపతులకు సమాచారం అందించారు. అంతేగాకుండా వారిని వెంటనే బయటకు తీసుకువచ్చారు. పెద్దపల్లిలోని అగ్నిమాపక వాహనం రప్పించారు. సిబ్బంది వెంటనే మంటల్ని అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇల్లు కాలిపోయింది. విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. గ్రామస్తులు సకాలంలో గమనించకపోతే సమీపంలోని ఇళ్లకు కూడా మంటలు వ్యాపించడమేకాకుండా ఆ ఇంట్లో వృద్ధులు చనిపోయేవారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.ఐదు లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

చేపలవేటకు వెళ్లి గిరిజన మహిళ మృతి

- నీటిలో మునిగి ఊపిరాడక దుర్మరణం



లక్ష్మి మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కూతురుతో కలిసి చేపలవేటకు వెళ్లిన ఓ గిరిజన మహిళ నీటమునిగి మృతిచెందింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ శివారులోని కల్‌నాయక్‌తండాలో విషాదం నింపింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. తండాకు చెందిన భూక్య లక్ష్మి(40) తన కూతురు కల్యాణితో కలిసి శుక్రవారం తండా శివారులోని ఒర్రె వద్దకు చేపలు పట్టడానికి వెళ్లారు. అక్కడ ఉన్న చిన్నమడుగులో చీరతో చేపలు పడుతుండగా.. లక్ష్మి కాలు జారి నీటిలో పడింది. తల్లి నీట మునగడంతో ఒడ్డున ఉన్న కల్యాణి తన దగ్గర ఉన్న ఫోన్‌తో తండావాసులకు సమాచారం ఇచ్చింది. తండావాసులు మడుగు వద్దు చేరుకొని లక్ష్మిని బయటకు తీయగా అప్పటికే ఆమె మృతిచెందింది. లక్ష్మి కూతురు కల్యాణి వివాహం వచ్చే నెలలో ఉంది. లక్ష్మి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కల్యాణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కార్తీక సందడి

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో సందడి నెలకొంది. భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని తులసీచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

- మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి తర్ఫీదు



శిక్షణ పొందుతున్న పోలింగ్ సిబ్బంది

ధర్మపురి: అసెంబ్లీ ఎన్నికలు సమర్థవంతగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌కు అవసరమైన సిబ్బందిని గుర్తించి వారికి శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక గిరిజన వసతి గృహంలో ఈనెల 22 నుంచి ప్రారంభించిన శిక్షణ తరగుతులు శుక్రవారం ముగిశాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పీవో, ఏపీవోలకు తరగుతులు నిర్వహించారు. కాగా శిక్షణ తరగతులను ఎన్నికల పరిశీలకులు బసవ రాజేంద్ర (ఐఏఎస్) పరిశీలించారు. నియోజకవర్గంలోని 300 మంది పీవోలు, ఏపీవోలకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు.

యంత్రాలపై అవగాహన..

ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పీవోలు, ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని ధర్మపురి, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా ధర్మపురి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 269 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లతో పాటు వీవీప్యాట్లను అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వాహణ గురించి వివరించారు. ధర్మపురి నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున ఒక బ్యాలెట్ యూనిట్ ఉంటుందని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చేటప్పుడు ఏదైన గుర్తింపు కార్డు చూపాలని సూచించారు. ఈవీఎం వినియోగంపై పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య, వివిధ మండలాల తహసీల్దార్‌లు, మాస్టర్ ట్రైనర్లు శివప్రసాద్, కాశెట్టి రమేశ్, చల్ల జనార్దన్, రమేశ్, చెరుకు రాజన్న, బక్కశెట్టి రవి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట



ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

మెట్‌పల్లి(కోరుట్ల): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం ఒకే చోట ప్రచారానికి వచ్చిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప గొడవ చోటుచేసుకుంది. స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఉన్న మసీదు వద్ద ముస్లింలను కలవడానికి ఇరు పార్టీల నాయకులు వచ్చారు. ఈ సందర్భంగా ఓట్లు అభ్యర్థిస్తుండగా అదే సమయంలో ఇరువైపులా కొందరు నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న బీఆర్ఎస్ వాహనాలకు కొందరు కాంగ్రెస్ స్టిక్కర్లను అతికించడం ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో ఇరుపార్టీల నాయకులు పరస్పరం దూషించుకుంటూ దాడులకు ప్రయత్నించారు. అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని వారిని చెదరగొట్టి పంపించారు.

మిగిలింది 4 రోజులే..



- వేడెక్కిన ప్రచారం
- ప్రధాన అభ్యర్థుల వ్యూహాలు
- ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నాలు

జగిత్యాల: ఎన్నికల ప్రచారం గడువు దగ్గర పడటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు వ్యూహాలు పన్నుతున్నారు. ప్రచారానికి ఇంకా నాలుగు రోజులే మిగిలి ఉండటంతో ఏ విధంగా ఓట్లు రాబట్టాలో ద్వితీయ శ్రేణి నాయకులకు సూచిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రచార సరళి అంచనా వేసుకుంటూ నాలుగు రోజుల్లో ఏం చేయాలో ప్రణాళిక వేసుకుంటున్నారు. ఇప్పటికే అభ్యర్థులతో పాటు, వారి బంధువులు వీధివీధిన, గ్రామగ్రామాన తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు.

ప్రలోభపర్వానికి వ్యూహం

పోలింగ్ దగ్గపడుతున్న కొద్దీ అభ్యర్థులు ఇక ప్రలోభపర్వానికి వ్యూహం పన్నుతున్నారు. ఈనెల 28న సాయంత్రం 5 గంటల వరకే ప్రచార గడువు ముగియనుండటంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు కిందిస్థాయి నాయకులు ఎలా అని ఆలోచిస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి గతంలో మద్యం, డబ్బు ఎక్కువగా పంపిణీ చేసేవారు. కానీ ఈసారి ఎక్కువగా నిఘా ఉండటం, ఎలక్షన్ కమిషన్ సీవిజిల్, 1950 లాంటి ఎన్నో సాంకేతికతలను ముందుకు తీసుకువచ్చింది. దీంతో ఎవరైనా ఓటర్లను మభ్యపెడితే సమాచారం అధికారులకు చేరుతుంది. దీంతో పకడ్బందీగా ఆలోచిస్తున్నారు. బూత్‌లవారీగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అలాగే ద్వితీయశ్రేణి నాయకులను నమ్మడానికి అభ్యర్థులు జంకుతున్నట్లు తెలిసింది. ప్రచారానికి గడువు తక్కువగా ఉండటంతో ఈ రెండు రోజుల్లోనే మొత్తం వ్యూహరచన చేసి ఓటర్లను ఆకట్టుకునేలా చూస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలో స్పీడ్ పెంచారు. ఓటర్లు సైతం ఆలోచిస్తున్నారు. గతంలో అన్ని పార్టీలకు చెందినవారు డబ్బులు పంపిణీ చేసినా ప్రతి ఒక్కరి వద్ద తీసుకుని ఎవరికి వేయాలనుకున్నారో వారికే వేశారు. ఇప్పుడు కూడా అలానే జరుగుతుందని పక్కా ప్రణాళికతో అభ్యర్థులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అభ్యర్థులకు ఓటరు నాడి తెలుసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. ద్వితీయశ్రేణి నాయకులపై నమ్మకం లేకుండా పోవడం, గ్రామాలు, పట్టణాల్లో కుటుంబ సభ్యులచే ప్రచారం చేయిస్తున్నా ఓటర్లకు అంతోఇంతో ముట్టనిది ఓట్లు వేయరనే భావన సైతం ఉంది. అయితే గ్రామాలు, మున్సిపాలిటీల్లో ద్వితీయశ్రేణి నాయకుల అవసరం ఎంతో ఉంటుంది. వీరి ద్వారానే ఓటర్లను ఆకర్శించుకునేలా వివిధ రకాల ప్రలోభాలకు గురిచేస్తుంటారు.

హోరెత్తిన ప్రచారం

సమయం దగ్గర పడుతున్నకొద్దీ ప్రచారం హోరెత్తింది. గడువు నాలుగు రోజులే ఉండడంతో గడపగడపకూ వెళ్లి ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. వాహనాలు సైతం అధికంగా పెట్టి ప్రచారం చేస్తున్నారు. నామినేషన్ పర్వం ముగిసినప్పటి నుంచి ప్రచారం చేస్తున్నా ప్రధానంగా ఈ నాలుగు రోజులే ఎక్కువగా ఓటర్లను ఆకర్శించే ప్రయత్నాలు చేస్తేనే ఫలితం వస్తుందని అభ్యర్థులు భావిస్తున్నారు. ఇందుకోసం వివిధ సంఘాలను కలిసినా, అందరితో కలిసేందుకు సిద్ధమవుతున్నారు.

విద్యుదాఘాతంతో హెల్పర్ మృతి

- ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా సంఘటన



శ్రీనివాస్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా కరెంట్‌షాక్‌తో ఓ హెల్పర్ దుర్మరణం చెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన జంగ నాంపెల్లి, సౌందర్య దంపతుల కొడుకు శ్రీనివాస్(22) రెండేళ్లుగా పోతుగల్‌లో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గంగమ్మ ఆలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం మరమ్మతు చేస్తుండగా.. పై నుంచి వెళ్తున్న హెచ్‌టీ లైన్‌కు అతని చేతిలోని తీగ తగిలింది. దీంతో విద్యుత్‌షాక్‌తో శ్రీనివాస్ కింద పడిపోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతిచెందాడు. ఆరు నెలల క్రితం ఇలాగే విద్యుత్‌షాక్‌కు గురై గాయాలతో బయటపడ్డాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని సెస్ తరఫున ఆదుకుంటామని రూ.5లక్షల పరిహారం ఇస్తామని డీఈఈ హామీ ఇచ్చారు. కాగా శ్రీనివాస్ కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇచ్చి, ఉద్యోగం కల్పించాలని బాధితుని బంధువులు డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి బీసీలకు ఇస్తాం

- హైదరాబాద్ పేరును భాగ్యనగర్ చేస్తాం
- అసోం సీఎం హిమంత బిశ్వశర్మ



మాట్లాడుతున్న అసోం సీఎం హిమంత బిశ్వశర్మ

చొప్పదండి: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే వరికి క్వింటాల్‌కు రూ.3,100 మద్దతు ధర చెల్లిస్తామని, పేదలకు ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని, ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి బీసీలకు కేటాయిస్తామని అసోం సీఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో శుక్రవారం బీజేపీ ప్రచార సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అస్సాంలో బీజేపీ ప్రభుత్వం రూ.97కే లీటర్ పెట్రోల్ అందిస్తోందని, తెలంగాణలో రూ.110 వసూలు చేస్తూ కేసీఆర్ పేదల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే హైదరాబాద్ పేరు భాగ్యనగర్‌గా మారుస్తామన్నారు. రాష్ట్రానికి బీసీ సీఎం చేస్తామని ప్రకటించిన ఏకైక పార్టీ బీజేపీయేనన్నారు. మందకృష్ణమాదిగ కోరిన డిమాండ్ నెరవేరుస్తామన్నారు. కేసీఆర్‌పై విచారణ జరిపి జైలుకు పంపుతామని చెప్పారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. బీజేపీ చొప్పదండి అభ్యర్థి బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, చేపూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాలువలో మృతదేహం

జూలపల్లి(పెద్దపల్లి): అబ్బాపూర్ వద్ద గల డి– 83 ప్రధాన కాలువలో ఓ వ్యక్తి(45) శవం లభ్యమైంది. ఎస్సై వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కాలువలో శవం ఉందని గ్రామపంచాయతీ కార్యదర్శి గాండ్ల రవీందర్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు కెనాల్ వద్దకు వెళ్లి పరిశీలించగా మృతదేహం కనిపించింది. దానిని పరిశీలించగా.. సుమారు ఇరవై రోజుల క్రితం కెనాల్‌లో పడిచనిపోయాడు. శవం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. జేబులో కొన్ని రకాల మందులు ఉన్నాయి. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు, ఈమేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.